విరూపం

ఇది వార్తో, వార్తా వ్యాఖ్యో, వార్తా కథనమో, భేటీయో, ముఖాముఖియో మరేదో చదివిన వెంటనే నా ఊహకు అందటం లేదు. ఈ మాత్రం రాయగలిగిన గ్రామీణ విలేకరి మా పత్రికకు ఉన్నాడా? అని ఆశ్చర్యపడ్డాను. రచన నిడివీ ఎక్కువే. నిర్మాణమూ కొత్తదే. రచనలో వాడిన రెండు రకాలైన శైలుల్లో ఒకటి పత్రికా భాషకు సరిపడేది. మరొకటి పత్రికా భాషలో పూర్తిగా ఇమడదంది. ఇలాంటి రచనను ప్రచురించాలో ప్రచురించకుండా చంపాలో, ప్రధాన పత్రికలో వచ్చేందుకు హైదరాబాదుకు పంపాలో తోచటం లేదు.

వచ్చి పడిపోతున్న వార్తల కూర్పు పని ఒత్తిడిలో సతమతమవుతున్నాను. అంత ఇబ్బందిలో కూడా మా గ్రామీణ విలేకరి పంపిన రచనను మళ్ళీ ఒకమారు చదివి నిర్ణయం తీసుకోవాలనుకున్నాను - ప్రాంతీయ కేంద్ర బాధ్యుడిగా. కంప్యూటరు తెరమీదే మొదటినుంచీ చదవటం మొదలు పెట్టాను:

నీరూ - పైరూ

తిప్పలూరు, ఏప్రిల్ 1. అది స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ఒక చిన్న పల్లె. మజరా గ్రామం. పేరుకు వేపమాన్ల పల్లె. ఒకప్పుడు వందలాది వేపచెట్లుండే వనాలు గ్రామ నెత్తంలో ఉండేవని స్థానికులు చెప్పారు. ఇప్పుడు ఊరి పేరులో ఏదో ఉందనే దానికి గుర్తుగా ఊళ్ళో ఏ వేపచెట్టూ మిగలలేదు. ఒకప్పటి చీనీ తోటలూ లేవు. మూడు మట్లకు పైగా నీళ్లతో కలకలలాడిన బావులూ లేవు. ఆ బావుల కింద తోటల్లో ఒకప్పుడు కనిపించిన చిలకపచ్చదనమూ లేదు. పూడిన బావులూ, ఎండిపోతున్న బోర్లూ

మాత్రమే కన్పిస్తాయి. మెట్టచేల గట్ల మీద ఒకప్పుడున్న తుమ్మ, రేగు, కానుగ చెట్లు ఇప్పుడు కలికానికి కూడా కన్పించవు. ఇప్పుడా పల్లె సిమెంటు ధూళి ధూసరావృతమైన పర్యావరణ సీమ; నింగి కెగిరి, నేల తాకి, పల్లె ప్రజల నాసికాపుటాల ద్వారా ఊపిరితిత్తుల్ని చుట్టుకుంటున్న సిమెంటు గాలి దుమ్ము క్షేత్రం. ఈ జన్మభూమి, సిమెంటు కర్మాగారాల లీలా విలాస కేళికి నర్తనశాల. ఈ కర్మభూమి, అన్నదాతలు ఫ్యాక్టరీ కార్మికులుగా మారిపోయిన అభివృద్ధి హేలకు రంగమండపం. ఫ్యాక్టరీకి వెళ్ళని సమయాల్లో, పల్లెలో ఇళ్ళ దగ్గరే ఉండిపోయిన పెద్దా చిన్నా, ముసలీ ముతకా, మహిళల తోడుతో, నిరుద్యోగ రైతు కూలీల తోడ్పాటుతో, అమ్ముకున్నవి పోగా మిగిలిన పొలాల్లో పంట కోసం కార్మిక రైతులు చేస్తున్న జయమెరుగని పోరాటభూమి ఇది!

ఉప్పర గురప్ప కథనం ప్రకారం:

'మా ఊరు నుంచా? దాపుదాపు నలభై మంది ఫ్యాక్టరీకి పోతాఉండాం అన్నా!' పల్లెలో ఉందేదా? యాభై ఇండ్లు. ఈ కులమని ఆ కులమని లేదు. మొత్తం అందరం పోతా ఉన్నట్లే. పెద్ద కులం లేదు. చిన్న కులం లేదు. అంతా ఒక దారే... అట భూమి ఉండే రైతు కుటుంబాలూ ఆ దారే; లేని కుటుంబాలూ ఆ దారే. నలభై ఎకరాలుండే కాపోల్ల పిల్లోడూ వస్తా ఉండాడు - ముప్ఫయి ఎకరాలుండే కమ్మోళ్ళ పిల్లోడూ ఉండాడు. అట్లాగే పద్దైదెకరాల గొల్లోల్లూ, ఆఖరికి రెండెకరాలోళ్ళూ ఫ్యాక్టరీ పనికి వస్తా ఉండారు. భూమి లేని కొదమోల్ల సంగతా? వాల్లూ ఉండారన్నా. రెండిండ్ల మంగలోల్లు, మూడిండ్ల వడ్డోల్లు, ఒకింటి భత్రోజోళ్ళు, ఒక నాలుగిండ్ల బోయోళ్ళు, ఒక సాయిబుల ఇంటినుంచి వస్తాండారు. మర్చిపోయినా బోయోల్లకు భూమి ఉంది.

నాకా? ఆరెకరాలుంది. ఏం లాభంలే అన్నా. ఇప్పుడు మూడేండ్లయింది. విత్తనాలకూ, పెట్టుబడికీ - అదే సేద్దెం. దుక్కి దున్నదానికీ... దుక్కికి ఏన్నూటా యాభై. పాసిందానికి ఇన్నూటా యాభై. నాలుగు మూటెలు ఫాస్పేటు పదార్నూర్లు. కలుపులకూ దానికీ పంతొమ్మిది నూర్లు - విత్తనాలకు పదార్నూర్లు. లెక్కేసుకో అన్నా. చిల్లర మల్లర ఖర్చులు కలుపుకొని యాదాదికి తొమ్మిదివేలు. మూడేండ్లకు ఎంతయింది? ఇరవై ఏడువేలు - ఏం పంట వేసినానో చెప్పనేలేదు. కుసుమలు - నల్ల కుసుమలు - పొద్దు తిరుగుడు అంటా ఉన్లా - సన్‌ఫ్లవర్ అంటా ఉన్లా? అన్నా! ఆ పంట - అదే కొంప ముంచింది, వరసగా. రాబడా? వచ్చింది బ్రహ్మాండంగా తలకాయ తిరిగేటట్లు - అయిదు నూర్లా నలభై రూపాయలొచ్చింది - ఒక కింటాలు కూడా రాలేదు. నలభై కేజీ లన్నా!

ఎందుకింత అద్మాన్నమా? వర్షం ల్యాకనే. జొన్నో గిన్నో వేసుకుంటే ఇన్ని తిండిగింజలన్నా దక్కేవి అంటావా? బాగా చెప్తావన్నా! స్టోరు బియ్యం వచ్చినాక జొన్న లెవడు తింటాడు? నువ్వు తింటా ఉండావా? వాటిని నానబెట్టాల. దంచి పొట్టు దియ్యాల. ఎండ బెట్టాలా? నూకలు విసరాల. ఎసుట్లో పొయ్యాల, గెలకాల. బండమీద ముద్దలు చెయ్యాల. ఎంత పని? ఒక తట్టు నేను ఫ్యాక్టరీకి పోతానా? నా పెండ్లాం కూలికి పోవాల్నా? బోరింగు కాదనుండి నీళ్ళు మోసుకుని తెచ్చుకోవాల్నా? ఇంటి

పనులన్నీ చూసుకోవాల్నా? ముగ్గురు కొడుకులు బడికి పోవాల్నా? మా అమ్మా నాన్నా లేకపోయిరి. నేను ఫ్యాక్టరీ పనికి గ్యాప్ వచ్చినప్పుడల్లా పొలం పనులు చూసుకోవాలా? జొన్న సంగటి ఎక్కడవుతుందన్నా? కొఱ్ఱల సంగతి అంతే. నీకు తెలీందేముంది? తిండి పంటల కంటే డబ్బు పంటలే మేలనే కదా కుసుమల్నో, పత్తినో వేసేది. డబ్బుంటే ఏవైనా కొనుక్కోవచ్చు. ఏమంటావు?

నా భార్యా.? ఇంటి దగ్గరే ఉంటాది. ఏదన్నా పనికి పోతాది. మిగతా ఇండ్లల్లో ఆడోళ్ళ సంగతంటావా? ఫ్యాక్టరీకి నలుగురైదుగురు ఆడోళ్లు వస్తాందారు. పిల్లి రామయ్య కూతురు, మొగుడు పోయి పుట్టింటికి చేరిన కుంటి సుబ్బయ్య కూతురు, మంగలోల్లామె వస్తాందారు. బుడన్ సాయిబు పెండ్లాం - బూబమ్మ - ఆ పర్దా ముసుగు తీసి వస్తాంది. ముసుగులో ఏంది ఉందన్నా? అంతా బతకడంలో ఉంది. బూబమ్మ దేవత అనుకో - బీబీ నాంచారి. పెద్ద రైతుల కుటుంబాల ఆడబిడ్డ ఎవరూ రావడం లేదు.

ఫ్యాక్టరీలో ఆడోళ్ళు చేసే పని ఏందంటావా? సిమెంటు పొదరు కింద పోతాదే, దాన్ని ఊడ్చి మిషన్లో పోసే పని. ఏందో పిల్లేజి ఎల్పర్లు అంటారే వాళ్ళను - ఆ పని. కూలి సంగతా? మొగోళ్ళ కంటే తక్కువేలే. పని లేనప్పుడు వీళ్ళు కూడా పొలం పనులకు పోతారు - ఇంటి పనులూ అవీ చూసుకొని. వాళ్ళకే పని ఎక్కువంటారా? అవున్లే - పిల్లల్ని చూసుకోవాల. వండాల. మా జేజి, మా యమ్మ, నా పెండ్లాం కంటే ఎక్కువ పని చేసేవాళ్ళు. ఏందో అది అంతేనన్నా!

మొగోళ్ళు చేసే పనా? లోడింగు. కష్టమైందే. నెలకు ఎంతిస్తారంటావా? నెలంతా పనిచేస్తే - అంటే కనీసం ఇరవై అయిదు రోజులన్నా పని ఉంటే పద్దెదు నూర్లు వస్తాది - ఖర్చులు పోను. టిఫినుకు ఆఱ్రూపాయలు. అన్నం పది... మాకు ఫ్యాక్టరీ క్యాంటీన్లో ఇవ్వరు. దినకూలీ వాళ్ళం కదా? టన్నేజీ మీద మా కూలి పడతాంది. మేమేం చదివినోళ్ళం కాకపోతిమి. ఈ పల్లెలో ఒక సెంటు పొలాన్ని కూడా ఫ్యాక్టరీ తీసుకోలేదు. ఇక్కడా దరిద్రమే. ఈ పల్లె పొలాల కింద ఏ రాయీ లేదంట - పనికి రాని మొరం తప్ప. అందుకే నన్నా చెప్పేది - మేమంతా లేబరు - కరెంటు పనోళ్ళు, పిట్టర్లు, వెల్డర్లు కాదు. లోడింగోల్లం.

ఈ ఫ్యాక్టరీ వల్ల మంచి జరిగిందా? చెడ్డ జరిగిందా? అంటావా? జరిగినోల్లకు జరుగుతానే ఉంది. జరగనోల్లకు జరగడం లేదు. ఎక్కువ పొలముండే వాల్లుండారా? వాల్లకు అంతో ఇంతో పండుతుందా? ఫ్యాక్టరీకి కూడా పోతా ఉందారా? ఒకరో ఇద్దరో అట్లా మిగిలించుకుంటూ ఉందారు. ఫ్యాక్టరీకి రావడానికి ఒకరిద్దరు మోటారు సైకిళ్ళు కొనుక్కున్నారు. టి.వి.లు కొనుక్కున్నారు. కొంతమందికి సైకిల్లుందాయి. కొంతమంది ఆటోల్లో వచ్చి పోతా ఉందరు - రాను పోనూ నాలుగు రూపాయలిచ్చి. ఇంకా కొంతమందీ, ఆడోల్లూ నడిచే వస్తాందారు. ఇదే మంచిది అనుకో. కర్చులు పెరిగినాయా? జల్సాలు పెరిగినాయా? గుడ్డ గురుసా మారిందా? నాలోంటాల్లం కొందరం సంచుల్లో సారా తాగడం మానేసి, రమ్ము తాగుతూ ఉందామా? రోజూ కాదనుకో. వారానికి ఒక మారాన్నా మాంసం తెచ్చుకోవాలా? చపాతీలో, పూరీలో

చేసుకోవాలా? ఇది మంచో చెడ్డో నాబోటి వాడికి తెల్దు. బతుకు మాత్రం మారింది. యాపారాలు చేసేవాల్లు మాత్తరం మా కంటే బాగుండారు. మేము పొలాన్ని వదులుకోలేము. ఫ్యాక్టరీ పనినీ వదులుకోలేము. ఏది పోయినా, ఎట్లా బతుకుతామో తెల్దు. నువ్వే చెప్పు?

తాగడం తప్పో కాదో నాకు తెల్దు. మా నాయన సారాయి కాచేవాడు. అమ్మేవాడు. తాగేవాడు. నా సంగతి చెప్తా. షిఫ్టు నుంచి బయటపడతానా? ముక్కులోకి, దొమ్మల్లోకి ఏం పోతాందో తెల్దు. ఒంటిమీద ఎంత దుమ్ము అంటుకుంటుందో తెల్దు. ఏం జరుగుతాదో యాడ పట్టించుకుంటాం? నిండా మునిగినాక చలేముందన్నా? ఇంటి కొచ్చాక ఇన్ని వేన్నీల్లు పైన పోసుకునేది - ఇంత గొంతులోకి రాత్రిపూట రమ్మో, సారాయో పోసుకునేది. ఇంత కడపులోకి తినేది... పగలైతే డూటీ. లేకపోతే మల్లా పొలం పని ఏదో ఒకటి ఉండనే ఉంటుంది. చెమటలు కార్చుకోవడం తప్పదన్నా!

మా ఆరోగ్యమన్నా ఫ్యాక్టరీ మేనేజ్‌మెంట్ చూస్తాదా అని అడుగుతాండావా? రెగులరు ఎంప్లాయిలకు మాదిరి మమ్మల్నీ చూడాలని కొట్లాడతా ఉండాం. వాల్లకిచ్చే సవుకర్యాలు మా కివ్వాలా వద్దా? జీతం సంగతి కాదు నేననేది - మిగతావి.

ఇదంతా సరేనన్నా! ఫ్యాక్టరీలో కొత్త సామాన్లు వేస్తే మాకు ఇంకా బాగుంటుంది. ముప్పయి రోజులు పని దొరుకుతుంది. పట్టుకునేది పోనూ రెండువేలా ఇన్నూరు దాకా గిట్టుతుంది. ఇప్పుడా? చెప్పినా గదా అన్నా? మూన్నాల్ల కొకమారి నిలబెడ్తారు. ఈ నెలల్లోనే మూడు మాట్లు సట్‌డవును. పనిలేకపోతేనా? ఏముంది? వారం గానీ పది దినాలు గానీ బయట ఉండాల్సిందే - ఇంటి కాడే. పని చేచ్చేనే డబ్బులొచ్చేది. ఆఁ యూనియన్లుండాయి, గలాటాలు పోయినాయి. యూనియన్లు చేసేకాడకి చేస్తాండాయి. మేనేజ్‌మెంట్ చెయ్యాల గద! 'కొత్త సామాన్లు వస్తుందయి. ఇదో బిగిచ్చాం' అంటారు. కొన్నేమో రావడం - బిగిచ్చడం. అన్నీ మార్చరు, ఒక్కమాటు. ఇదిట్లాగే... చట్టిలో కూడు, చట్టిలో ఉండాల, పిల్లలేమో బలంగా ఉండాల అంటే ఎట్లా కుదురుతుంది? ఫ్యాక్టరీ నడిస్తేనే టన్నేజి పెరుగుతుంది. టన్నేజీ పెరిగిపోతే మాకు లాబం.

మా కంటే వాల్లకే బాగా లాబం గదా? అంటుండావా? వాళ్లు తింటే తిననీ. మాకు ముప్పయి దినాలు పని దొరికితే చాలు. గవర్నమెంటు అన్నిట్నీ అయిన కాటికి ప్రైవేటోల్లకు తెగనమ్ముతావుందంట! ప్రైవేటోల్లు లాబం చూసుకోకుండా ఏదన్నా కొనుక్కుంటారా? నడుపుతారా? గవర్నమెంటు పాలసీ అది. ఈ ఫ్యాక్టరీలోల్ల పాలసీ ఇది. 'ఏం చెయ్యాల చెప్పు - చేతుల కష్టం అమ్ముకోక? అయినా ఈ ఫ్యాక్టరీని మద్రాసు బాపనోల్లు తీసుకున్నాక కొంత మేలేలే - గలాటా లన్నీ తగ్గినాయి. ఎట్లనా? ఎందుకా? ఎక్కడ పదేసేది అక్కడ పడేచ్చా ఉంటారు. యాడ పట్టుకునే వాల్లను ఆడ పట్టుకుంటూ ఉందారు.

ఫ్యాక్టరీ వల్ల పైర్లు దెబ్బతినలేదంటావా? 'పసుప్పచ్చటి చందమామ మాదిరుండే కుసుమ పువ్వుల మీద బూడిదరంగు సిమెంటు చూల్లేదా' అంటావా? అన్నా! అన్నీ మా కండ్లతోనే చూచ్చానే ఉండాం - కనిపించిన కాడికి. చూసి ఏం చెయ్యాల? ఇది మంచో

చెడ్డో మాకు తెల్దు. అటికీ మా యూనియన్ల వాల్లు అడగిచ్చినారు - ఎవర్తోనో. టి.వి.లో కూడ వచ్చిందంట. నేను చూల్లేదు. ఆ దుమ్ము సంగతి పోనీ - పండేది బాగా పండనన్నా - పండి చస్తే బాగుండు. పొంత లోంచి పొయ్యి లోకి పడినట్లయింది ఈ బతుకు.

చూడన్నా! మా అబ్బతరం, మా నాయన తరం సంగతి అడిగినావు. మా అబ్బది ఉప్పరి పని. పైగా గానుగాడేవాడు. ఎక్కువగా ఆముదాలు, నువ్వులు, ఎప్పుడన్నా సెనగ్గాయల పప్పు. ఒక గానుగ, ఒక కుంటి ఎద్దూ, మా అబ్బా, జేజి. ఈ ఆరెకరాలూ మా అబ్బ కొనిందే. రాళ్లురప్పుల పొలం. మా నాయన, ఆ తర్వాత నేనూ బాగు చేసుకున్నాం - ఇంటిల్లపాదితో కలిసి. మా నాయన సేద్యానికుండేవాడు. గానిగ మూలబడింది. మా నాయన తరానికే గానిగాడించుకునేది పోయింది. నాకు ఇదిగో ఈ ఫ్యాక్టరీ పని దొరికి నప్పట్నుంచీ బాగుపడొచ్చుననుకుంటున్నా. ఈ ఆరెకరాల పొలం కూడా, పైరు పెట్టడానికి లాయికి అయింది, అయిదారేండ్లు నుంచే. ఏమన్నా అను వాల్ల కాలం కంటే మాది నయమే. నా ముగ్గురు కొడుకుల్ని చదివించుకుంటే చాలు. పెద్దోడు ఏడు, నడపోడు అయిదు. చిన్నోడు మూడు. ముందు ముందు వాల్లు ఏం చదువుతారో నాకు తెల్దు. ఉద్యోగాలొచ్చాయో లేదో నాకు తెల్దు. ఈ పొలం ఉంటుందో ఊడుతుందో నాకు తెల్దు. అన్నా! ముందు ముందు ఎట్లా ఉంటుంది అంటే ఏం చెప్పేది? నేనేమి పోతులూరు వీరబ్రమ్మాన్నా? గవర్నమెంటునా?...'

ఉప్పర గురప్ప మూడేండ్ల కిందటి కథనాన్ని మా విలేకరి తానప్పుడు సేకరించిన వివరాలను - ఇటీవలి గురప్పకు విన్పించాడు. తాజా పరిణామాల గురించి ప్రశ్నించాడు. గురప్ప మాటల్లోనే ఇటీవల వృత్తాంతం:

'అన్నావ్! ఈ మద్యనే అరియర్లు వచ్చినాయి. మొగోని మాదిరి ఇరవైవేలు బాకీ తీర్చినా. ఇంకా పదివేలుందనుకో. లెక్కలేదు. దొమ్మ పొగరుంది. ఫ్యాక్టరీ ఉంది. పొలం తల్లి ఉంది...

పైగా కూలి పెరిగిందన్నా, మా కంట్రాక్టు లేబరుకు. ఇప్పుడు రోజుకు ఇన్నూటెనబై పడతుంది. ఏడువేలకు పైన్నే నెలకు వచ్చాదా అంటావా? అంతొచ్చే ఇంకేం? నెలకు పది రోజులు కూడా పని ఉండదం లేదు. మల్లా, పిఎఫ్ అదీనూ. మూడేండ్ల కిందటి లెక్కేననుకో - ఒక ఇన్నూరో మున్నూరో అటూ, ఇటూగా ఎక్కువే రావచ్చు. మరి గూబ అదిరేటట్లు అన్నీ పిరెం అయినాయి. పెంచడం ఏందో? పని రోజులు తగ్గించడమేందో? కూలిరేటు పెరిగితే, పని రోజులు తగ్గాలా? ఈ మాయ ఏందో తలకాయ కెక్కదు.

అందుకే... అన్నా! ఈసారి ఆరెకరాల్లో పత్తి వేసినా - పెట్టుబడి ఎంతైనా సరే, తెగించి పెడుతున్నా. కల్తీ విత్తనాలు, కల్తీ మందులు అంటావా? మా కెట్లా తెలుస్తుందన్నా! పురుగు పట్టకుండా చూసుకోవాల? పత్తి విరగ బుయ్యాల. ఇంటికి చేరాల అంతే. మంచి రేటు ఉంటుందో ఉండదో అంటావా? ఏమన్నా గానీ... అనంతపురం రైతుల మాదిరి నేను పురుగుల మందు తాగి మాత్తరం చచ్చిపోను.

అంత దరిద్రం నెత్తి మీద కూకుంటే, అప్పులు తీర్చలేకపోతే ఒక పని చెయ్యడమే. సిమెంటు రాయి, కంకర, బొగ్గు, ఎర్రమట్టి - అన్నిటితో పాటుగా మిషనులోకి దూకడమే. 'ఏమవుతాది?' ఉడికి ఉడకి చచ్చి సున్నమై సిమెంటును కావడమే. పెండ్లాం, పిల్లోల్లు గతి ఏమంటావా? చచ్చినాక నాకు తెలిసిందేముంది?'

దా'రుణ' సీమలోని ఒక జీవన దృశ్యం ఇది. పైరూ, మనిషీ నీరుగా మారిపోతున్న 'నీరూ - మీరూ' లోకం ఇది. హైటెక్ చలనమిది!"

రచన చదవటం పూర్తి అయింది. ఆ క్షణంలో నాలో ఏ ఏ భావాలు కలిగాయో చెప్పలేను. శీర్షికలోని 'నీరు' ను గురించి ఆలోచించాను. పైరూ, మనిషీ నీరుగా మారిపోవడం అంటే ఏమిటి? నీరూ - మీరూ సరే సరి. ప్రభుత్వం ప్రచార నినాదంలో నీళ్ళున్నాయి. మరి గ్రామీణ విలేకరి ఏ అర్థంలో వాడాడు? చప్పున స్ఫురించింది. నీరు అనే మాటకు మరొక అర్థం బూడిద అని. అది ఒకప్పటి నీఱు అనే తెలుగు పదానికి ఇప్పటి రూపం అన్నమాట! మా గ్రామీణ, విలేకరి ఊహాశక్తిని మెచ్చుకోకుండా - మనసులోనే - ఉండలేకపోయాను. పని ఆపి కడప మోడెం సెంటరుకు ఫోను చేశాను. అక్కడి విలేకరి సుబ్రహ్మణ్యం దొరికాడు.

"నీరూ - పైరూ స్టోరీ రాసి పంపిన స్ట్రింగరు పేరేమి?" అని అడిగాను.

"అతనా సార్! నెల కిందట మన ఎడిటరు సారు కడపకు వచ్చినాడు గదా సార్? ఎం.ఎల్.ఎ సుబ్బిరెడ్డి మన ఎడిటరుకు చెప్పినాడు. 'ఉద్యోగం లేదు. బి.ఏ. పాసై అయిదేండ్లయింది. కమలాపురం. పైగా పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. గంపెడంత సంసారం. తండ్రి టింకరు'..."

నాకు తిక్కరేగింది. నా తొందర నాది. సమయం తరుముతోంది. నా చావు నాది. జిల్లాల పేజీలు పెట్టడమూ, ప్రింటింగూ ఇంకా పూర్తి కాలేదు. ఈ సుబ్రహ్మణ్యం ఏదీ సూటిగా చెప్పడు; ఏదీ సూటిగా రాయడు. వివరాలు ఏకరువు పెడుతూనే ఉంటాడు. సమయాన్నీ, సందర్భాన్నీ పట్టించుకోడు. విసుగును అణచుకుంటూ అడిగాను:

"ముందు స్టోరీ రాసిన మనిషి పేరు చెప్పవయ్యా స్వామీ! వివరాలు రేపడుగుతాను"

"ఇస్మాయిల్ సార్! ముస్లిం. తెలుగు బాగా రాస్తాడు. కొంచెం తిక్క సార్..."

మా అనంత వచన విలేకరి ఇంకే వివరాలు చెప్పబోతాడో అనుకుంటూ పని తొందరలో ఫోను పెట్టేశాను.

'నీరు - పైరూ'ను హైదరాబాదులోని మా అసిస్టెంట్ ఎడిటర్‌కు మోడెం ద్వారా పంపివేశాను. ఆయన మానవతా వార్తల్ని రాయటంలో పేరున్న పత్రికా రచయిత. అవసరమైన మార్పులతో, ప్రతి శనివారం వెలువడే మా ప్రధాన పత్రికలోని ప్రత్యేక పేజీ 'రైతు ప్రపంచం'లో నీరూ - పైరూ రావచ్చు ననుకున్నాను. ఆయనకు ఏది ముఖ్యమో, ఏది కాదో, ఎట్లా, ఎందుకుపయోగించుకోవాలో తెలుసునని నా నమ్మకం.

నమ్మకాలు అన్ని సమయాల్లో నిజం కావు. మనం నమ్మినట్లు మనుషులందరూ ఉండరు. ఉండలేరు.

రైతు ప్రపంచంలో మా గ్రామీణ విలేకరి ఇస్మాయిల్ వార్త రచన రాలేదు. ఆ ఆదివారం మాత్రం మా ఎడిటరు గారి నుంచి ఫోను వచ్చింది - కంఠస్వరంలోని రంగూ, రుచీ, వాసనా, ధ్వనీ, స్పర్శా భేదాలలో.

"ఏదో స్టోరీ పంపారట. చూశాలే. తలా తోకా లేదు. ఈ స్ట్రింగర్లతో వేగలేక చస్తున్నాం. మన ఖర్మ కొద్దీ దొరుకుతారు - ఇలాంటి వాళ్ళు. బాగా రాస్తాడని అంటే, ఇలాగా రాయటం? మన కడప కరస్పాండెంట్ ఆ సుబ్రహ్మణ్యం లేడూ అతనితో మాట్లాడండి. ఇలాంటి వాటిని రాయవద్దని ఆ స్ట్రింగరుకు చెప్పమనండి. లైన్ అకౌంటు వార్తలేవో రాసుకోమని బుద్ధి చెప్పమనండి. మనది ఇంగ్లీషు జర్నలిజమూ కాదు. ఆ కొత్త స్ట్రింగరు మన కాలమిస్టూ కాదు. ముఖ్యంగా రాజకీయంగానో, మరొక రకంగానో నేను ఇరుక్కునే వాటిని రాయవద్దని తలకెక్కేట్లు చెప్పమనండి. వింటున్నారా?... అంతగా కావాలంటే స్వంతంగా కథలు రాసుకోమనండి. ఎక్కడైనా అచ్చు వేసుకోమనండి. మనకు సాల్మన్ రష్దీలో, అరుంధతీ రాయ్‌లో, రామ్‌లో అఖ్ఖర్లేదు: వింటున్నారు కదా! మనకు ప్రయోగాలొద్దండి. ఆ రకం వాటిని కిల్ చేసేది కూడా తెలియకపోతే ఎలాగండి? మీరు సీనియర్ అనే గదా అక్కడికి పంపింది. మన హిందువులు సృష్టించుకుంటున్న సంపదకు వ్యతిరేకంగా రాయటమేమిటండీ?..."

మా ఎడిటరు గారి ఫోను గూటింపుతో నా బుర్ర తిరిగి పోయింది - మధ్య మధ్యలో 'సార్ సార్ ఆఁ సార్' అనటంలో తల దిమ్మెక్కింది. ఇంతకూ నీరూ - పైరూ రాజకీయమో, ఏ విధంగా మరొక రకమో నాకు అర్థం కాలేదు. పత్రికా రచన, కథల కంటే ఎంతెత్తున ఉందో నాకు ఏ మాత్రం తెలియటం లేదు. ప్రయోగాలు నా ఒంటికి సరిపడతాయో లేదో అనే సంగతి ఏమో గానీ, వృత్తి భద్రతకు సరిపడవని మాత్రం ఎడిటరు గారి గొంతు తీరును బట్టి తెలిసిపోయింది.

ఎడిటరు గారి చివరి మాటే నాకు బోధ పడలేదు - ఎంత గింజుకున్నా ఆ వాక్యార్థాన్ని వెతుక్కుంటూనే ఉన్నాను - మా దినపత్రికలోని వార్తల బట్టీ, మా సంపాదకుల ప్రత్యేక వ్యాసాల్ని బట్టీ - ప్రతిరోజూ వెతుక్కుంటూనే ఉన్నాను, రాయలేలిన రతనాల సీమలో, తెలుగు గంగాజలం గొంతు తడపని భూముల్లో... ఇస్మాయిల్ రచన మిగిల్చిన జ్ఞాపకాల్లో...

● ప్రస్థానం సాహిత్య ప్రత్యేక సంచిక, 2002. ●